



సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

గిరిజనుల చెంతకు అత్యాధునిక వైద్యం

పాడేరు మెడికల్ కాలేజీలో వచ్చే నెల నుంచి తరగతులు ప్రారంభం



పాడేరులో మెడికల్ కాలేజీ నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

మెడికల్ కాలేజీ పనులు వేగవంతం

ప్రారంభోత్సవానికి సిద్ధం చేయండి ▸▸ అధికారులకు కలెక్టర్ ఆదేశం

పాడేరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి):
పాడేరు మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను వేగవంతం చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆయన మెడికల్ కాలేజీని సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ ఏడాది నుంచి తరగతులు ప్రారంభించేందుకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ అనుమతి లభించిందని, ఈ నెలాఖరుకు తరగతుల నిర్వహణకు అవసరమైన నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. అక్టోబరు ఒకటి నాటికి మెడికల్ కాలేజీని ప్రారంభించేందుకు సిద్ధం చేయాలన్నారు. తరగతి గదులు, ల్యాబ్‌లు, వసతి గదులు, కార్యాలయం, మ్యూజియం పనులు యుద్ధప్రాతిపదికన జరగాలన్నారు. సిమెంట్, ఇసుక కొరత ఏర్పడకుండా ముందస్తుగానే నిల్వ చేసుకుని పనులు వేగంగా చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, ఏపీఎస్ఎంఐడీసీ ఈఈ అచ్చెంనాయుడు, డీఈఈ వర్మ, డీజీఎం మధుబాబు, ఏఈఈ సురేశ్ పాల్గొన్నారు.

వైద్యులు అంకితభావంతో పని చేయాలి

స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు అంకితభావంతో పని చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ సూచించారు. ఆస్పత్రిలో గురువారం సాయంత్రం వైద్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్పత్రిలో చేరిన రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, వైద్యులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. ఆస్పత్రిలో ఖాళీల భర్తీ, ఇతర సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆస్పత్రిలో ఖైనీ, గుట్కా వినియోగంపై పోలీస్, రెవెన్యూ సిబ్బందితో చర్చించి నియంత్రణకు కృషి చేస్తామన్నారు. అలాగే ప్రతి వారం జాయింట్ కలెక్టర్ ఆస్పత్రిని సందర్శించాలని కలెక్టర్ ఆదేశించారు. రోగులు, వారికి అందించే సేవల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్‌గౌడ్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, వైద్యులు పాల్గొన్నారు.



పాడేరులో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ



పాడేరులోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

- అందుబాటులోకి రానున్న వైద్య నిపుణులు, సదుపాయాలు
- ఇకపై రోగులను కేజీహెచ్‌కి తరలించే ఇబ్బందులు తొలగినట్టే
- ప్రస్తుతానికి మెడికల్ కాలేజీకి అనుబంధంగా 200 పడకల ప్రభుత్వాస్పత్రి
- మరో ఏడాదిలో మెడికల్ కాలేజీలోనే అందుబాటులోకి 500 పడకలు

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

ఏజెన్సీ వాసులకు త్వరలో అత్యాధునిక వైద్యం అందనుంది. అత్యవసర వైద్య సేవల కోసం కేజీహెచ్‌కి వెళ్లే కష్టాలు తీరనున్నాయి. పాడేరు మెడికల్ కాలేజీలో వచ్చే నెల నుంచి తరగతులు ప్రారంభం కానుండడంతో ఈ ప్రాంత గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

రాష్ట్రంలో ప్రతి పార్లమెంట్ స్థానం పరిధిలో ఒక మెడికల్ కాలేజీని నిర్మించాలనే లక్ష్యంతో అరకులోయ పార్లమెంట్ పరిధిలోకి వచ్చే పాడేరులో మెడికల్ కాలేజీని నిర్మిస్తున్నారు. మరో ఏడాదిలో మొత్తం నిర్మాణ పనులు పూర్తికానున్నాయి. ఈ తరుణంలో గిరిజనుల అవసరాల రీత్యా ఈ ఏడాది నుంచే ఎంబీబీఎస్ తరగతులను ప్రారంభించేందుకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ అనుమతి ఇచ్చింది. దీంతో వచ్చే నెల నుంచి ఇక్కడ ఎంబీబీఎస్ తరగతులు మొదలు కానున్నాయి. మరో ఏడాదిలో మెడికల్ కాలేజీలోనే 500 పడకలు అందుబాటులోకి రానున్నాయి.

వైద్య నిపుణులు, సదుపాయాలు అందుబాటులోకి..

ఏజెన్సీ 11 మండలాల్లో 36 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, పాడేరులో 200 పడకలు, అరకులోయలో 100 పడకలు, చింతపల్లిలో 50 పడకలు, ముంచంగిపుట్టులో 30 పడకల ఆస్పత్రులున్నాయి. ఏజెన్సీలో ఎక్కడా ప్రైవేటు కార్పొరేట్ ఆస్పత్రులు లేవు. అలాగే ఉన్న పీహెచ్‌సీల ద్వారా మెరుగైన వైద్యసేవలు అందకపోవడంతో

... మిగతా 8వ పేజీలో

గురువులే మార్గదర్శకులు

విద్యార్థుల భవిష్యత్తుకు దారి చూపేది వారే..

- కాలానుగుణంగా బోధనా పద్ధతుల్లో మార్పు రావాలి
- కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్
- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- 104 మంది ఉత్తమ గురువులకు సత్కారం



మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తుకు దారిచూపేది ఉపాధ్యాయులేనని, ఆ దిశగానే ప్రతి ఉపాధ్యాయుడు సేవలందించాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ సూచించారు. స్థానిక కాఫీ హౌస్‌లో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సమాజానికి ఉపయోగపడేలా విద్యార్థులను ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని, కాలానుగుణంగా ఉపాధ్యాయులు అప్‌గ్రేడ్ కావాలని, బోధనా పద్ధతుల్లోనూ మార్పులు రావాలని సూచించారు. ఇప్పటికీ తన టీచర్లను మర్చిపోలేదని, ఈ కార్యక్రమానికి వచ్చే ముందే వారికి శుభాకాంక్షలు తెలిపానని కలెక్టర్ చెప్పారు. మార్గదర్శిని పేరుతో గిరిజన విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ తరగతులు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ అమిత్ బర్దార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను ఉపాధ్యాయులు వెలికి తీసి వారి నైపుణ్యానికి మెరుగుపెట్టాలన్నారు. విద్యార్థులు పెద్ద కలలు కనేలా, వాటిని సాకారం చేసుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థుల్లో ఎక్కువగా ఫెయిల్యూర్ భయం ఉందని, దానిని పోగొట్టి లక్ష్యం చేరేలా వారితో ఆత్మ విశ్వాసం పెంపొందించాలన్నారు. అనంతరం జడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. అంతకు ముందు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి అధికారులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన 104 మంది ఉపాధ్యాయులను అతిథులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ సౌర్యమన్ పటేల్, జిల్లా రెవెన్యూ అధికారిణి బి.పద్మావతి, జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, టీడబ్ల్యూ డీడీ ఐ.కొండలరావు, ఎంఈవోలు విశ్వప్రసాద్, సరస్వతి దేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాగులు ఉగ్రరూపం

భారీ వర్షాలకు వరద ప్రవాహం

పలు గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు

అనంతగిరి, సెప్టెంబరు 5:
మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. గెడ్డలు, వాగులు పొంగి ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భీంపోలు గ్రామ సమీపంలో చీమిడిపల్లి గెడ్డ పొంగి ప్రవహించడంతో భీంపోలు, గుమ్మకోట, గరుగుబిల్లి, రొంపల్లి పంచాయతీల్లోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పినకోట-కుడియ మధ్యలోని కాజ్‌వే పైనుంచి గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో పినకోట, పెదకోట, కివర్ల తదితర గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి. లుంగుపర్తి పంచాయతీ నేలపాలం గిరిజనులు రేషన్ సరకులతో ఉధృతంగా పారుతున్న గెడ్డను దాటారు. నేలపాలెం గ్రామానికి చెందిన సుమారు 8 మంది విద్యార్థులు మెట్టవలసలోని ఎంపీపీ పాఠశాల చదువుతున్నారు. వీరిని గెడ్డ దాటించేందుకు తల్లిదండ్రులు ఇబ్బందులు పడ్డారు.



లంగుపర్తి గెడ్డను దాటి రేషన్ సరకులు తెచ్చుకుంటున్న గిరిజనులు



భీంపోలు సమీపంలోని రహదారి పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు



మోతుగూడెం-చింతూరు రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు

అరకులోయలో..

అరకులోయ: మండలంలో గురువారం ఉదయం నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. రోజంతా దఫదఫాలుగా కురవడంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది.

డుంబ్రిగుడలో..

డుంబ్రిగుడ: అల్పపీడన ప్రభావంతో మండలంలో బుధవారం రాత్రి నుంచి వర్షాలు కురుస్తున్నాయి. గురువారం ఉదయం జల్లులతో కూడిన వర్షం పడగా, మధ్యాహ్నం తెరిపిచ్చి సాయంత్రం నాలుగు గంటల నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. మారుమూల గిరిజన గ్రామాల్లోని మట్టి రోడ్లు బురదమయంగా మారాయి. అల్పపీడన ప్రభావంతో వర్షాలు అధికమైతే వరి పంటలకు నష్టం వాటిల్లే పరిస్థితి

... మిగతా 8వ పేజీలో



చింతలపాలెం గెడ్డను దాటుతున్న వైద్య సిబ్బంది

వైద్య సిబ్బంది సాహసం

- ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డ దాటి వైద్య సేవలు
- కూడియ, కొండిబకోట, చింతలపాలెం గ్రామాల్లో గిరిజనులకు వైద్యం

అనంతగిరి, సెప్టెంబరు 5: గిరిజనులకు వైద్య సేవలు అందించేందుకు పినకోట పీహెచ్‌సీ సిబ్బంది సాహసం చేశారు. ఉధృతంగా ప్రవహిస్తున్న చింతపాలెం గెడ్డను గురువారం ఉదయం ప్రాణాలకు తెగించి దాటి వైద్య సేవలు అందించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చింతలపాలెం గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలోని పెదకోట, పినకోట పంచాయతీల పరిధిలో గల చింతలపాలెం, కుడియా, కొండిబకోట గ్రామాలకు వెళ్లాలంటే ఈ గెడ్డ దాటాల్సిందే. అక్కడి గిరిజనులకు వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో పినకోట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఎస్.రాంబాబు, ఏఎన్ఎం శ్రావణి, ఎమ్ఎల్‌హెచ్‌పీ పుష్ప ప్రాణాలకు తెగించి ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డను ఉదయం దాటి వెళ్లారు. ఆయా గ్రామాల గిరిజనులకు వైద్య సేవలు అందించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. అనంతరం సాయంత్రం వేళ గెడ్డ దాటి వచ్చారు. వీరి సాహసాన్ని పలువురు అభినందించారు.

సబ్‌కలెక్టర్‌గా శౌర్యమన్ పటేల్ బాధ్యతల స్వీకరణ

పాడేరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి):
స్థానిక సబ్‌కలెక్టర్‌గా 2022 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన శౌర్యమన్ పటేల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయన స్థానిక మోదకొండమ్మను దర్శించుకున్నారు. తరువాత కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్‌ను, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్ గౌడ్‌ను, ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. వారంతా ఆయనకు అభినందనలు తెలిపారు. సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు సబ్‌కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి టి.చిరంజీవిపడాల్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సబ్‌కలెక్టర్ కార్యాలయం డిప్యూటీ తహసీల్దార్ ధర్మరాజు, రెవెన్యూ సిబ్బంది అభినందనలు తెలిపారు. రెవెన్యూ సేవలను గిరిజనులకు మరింత చేరువ చేస్తానని ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్ తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ సౌర్యమన్ పటేల్

డుడుమ, జోలాపుట్టు జలాశయాలు కళకళ

గరిష్ఠ స్థాయిలో నీటిమట్టాలు

▸▸ ఏ క్షణంలోనైనా నీటిని బలిమెలకు విడుదల చేసే అవకాశం



వరద నీటితో కళకళలాడుతున్న జోలాపుట్టు స్పిల్‌వే డ్యామ్



జోలాపుట్టు స్పిల్‌వే డ్యామ్ 8వ నంబరు గేటు పైనుంచి వెళుతున్న వరద నీరు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 5: ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీరందించే డుడుమ, జోలాపుట్టు జలాశయాలు వరదనీటితో కళకళలాడుతున్నాయి. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆయా జలాశయాల్లో వరద నీరు అధికంగా వచ్చి చేరుతున్నది. నీటి నిల్వలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. డుడుమ జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 2,590 అడుగులు కాగా, గురువారం 2,584.40 అడుగుల నీటిమట్టం నమోదైంది. అలాగే దీనికి ఎగువ ప్రాంతంలో గల జోలాపుట్టు జలాశయంలో 2,750 అడుగుల నీటిని నిల్వ ఉంచే సామర్థ్యం ఉండగా, ప్రస్తుతం 2,547.35 అడుగుల నీటిమట్టం నమోదైంది. జోలాపుట్టు జలాశయానికి ఆనుకొని ఉన్న స్పిల్‌వే డ్యామ్ సైతం నిండుకుండను తలపిస్తున్నది. ఆ డ్యామ్ గేట్ల పైనుంచి వరద నీరు ప్రవహిస్తోంది. గురువారం 8వ నంబరు గేటు పైనుంచి ఎక్కువగా నీరు ప్రవహించింది. ప్రస్తుతం మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో నాలుగు జనరేటర్ల సహాయంతో 80 మెగావాట్ల విద్యుదుత్పాదన చేస్తున్నామని ప్రాజెక్టు అధికారులు చెప్పారు. అలాగే ఈ రెండు జలాశయాల్లో వరద నీరు ఇన్‌ఫ్లో పెరగడం వల్ల ఏ క్షణంలోనైనా గేట్లను ఎత్తివేసి బలిమెలకు నీటిని విడుదల చేసే అవకాశం ఉందని ప్రాజెక్టు వర్గాలు తెలిపాయి. ఇందులో భాగంగా ఆయా జలాశయాల దిగువ ప్రాంతాల్లో ఉండే గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతాల ప్రజలకు సైతం ప్రాజెక్టు అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. నీటిని విడుదల చేసే అవకాశం ఉందని, ఎవరూ గెడ్డల వద్దకు రావద్దని, వాటి పైనుంచి రాకపోకలు సాగించరాదని, చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించారు.

క్రైం... crime news

చేపల వేటకు వెళ్లిన గిరిజనుడి మృతి


గెమ్మెల భీమరాజు(ఫైల్)

అనంతగిరి, సెప్టెంబరు 5: చేపల వేటకు వెళ్లి గల్లంతైన గిరిజనుడు మృత్యువాత పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మండలంలోని భీంపోలు పంచాయతీ బీటుగురువు గ్రామానికి చెందిన నలుగురు గిరిజనులు విజయనగరం జిల్లా మెంటాడ మండలం ఆంధ్రా డ్యామ్ వద్దకు మంగళవారం రాత్రి చేపల వేటకు వెళ్లారు. చేపల వేట సాగిస్తుండగా గెమ్మెల భీమరాజు(22) గల్లంతయ్యాడు. దీంతో ముగ్గురు గిరిజనులు భయంతో ఇంటికి వచ్చేశారు. గురువారం ఉదయం డ్యామ్ వద్ద మృతదేహం తేలడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసుల విచారణలో చేపల వేటకు వచ్చి గల్లంతు అయినట్టు గుర్తించారు. మృతదేహానికి విజయనగరం ఆస్పత్రిలో పోసుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సినర్జిన్ ఫార్మా ప్రమాదంలో మరొకరి మృతి

నాలుగుకు చేరిన మృతుల సంఖ్య


మృతుడు ఓయబోస్ కొరహ్ (ఫైల్ ఫొటో)

పరవాడ, సెప్టెంబరు 5 : ఇక్కడి ఫార్మాసిటీలోని సినర్జిన్ యాక్టివ్ ఇన్‌గ్రేడియంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ యూనిట్ -3లో ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓయబోస్ కొరహ్ (21) గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. గత నెల 22వ తేదీ అర్ధరాత్రి సినర్జిన్ ఫార్మాలో జరిగిన ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. వీరిలో విజయనగరం జిల్లాకు చెందిన కెమిస్ట్‌తో పాటు జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ముగ్గురు హెల్పర్లు తీవ్రంగా గాయపడడంతో విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. వీరిలో కెమిస్ట్‌తో పాటు జార్ఖండ్‌కు చెందిన ఇద్దరు హెల్పర్లు రోజుల వ్యవధిలో మృతి చెందారు. 90 శాతం గాయాలతో చికిత్స పొందుతున్న ఓయబోస్ కొరహ్ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఇతడికి భార్య సౌమ్య కొరహ్, మూడు నెలల పాప ఉన్నారు. మృతదేహానికి గురువారం కేజీహెచ్‌లో పోస్టు మార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు సీఐ ఆర్.మల్లికార్జున రావు తెలిపారు.

ఏవోబీలో 1,100 కిలోల గంజాయి డంప్ స్వాధీనం

సీలేరు, సెప్టెంబరు 5: ఆంధ్రా-ఒడిశా బోర్డర్ (ఏవోబీ)లో 1,100 కిలోల గంజాయి డంప్ లభ్యమైందని కలిమెల పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా కలిమెల స్టేషన్ పరిధిలోని పప్పులూరు పంచాయతీలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయన్న నిఘా వర్గాల సమాచారంతో పోలీసులు బుధవారం నుంచి కెందుగూడ అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలను చేపట్టారు. అటవీ ప్రాంతంలో ఒకచోట అనుమానం వచ్చి తవ్వి చూడగా 1,100 కిలోల గంజాయి లభ్యమైందని కలిమెల పోలీసులు తెలిపారు. గంజాయిపై ఇటీవల ఆంధ్రా, ఒడిశా పోలీసులు ఉక్కుపాదం మోపడంతో స్మగ్లర్లు అటవీ ప్రాంతంలో దాచి ఉంటారని భావిస్తున్నారు. గంజాయి డంప్ ఎవరిదన్న కోణంలో ఒడిశా పోలీసులు సమీప గ్రామాల్లో ఆరా తీస్తున్నారు.

గర్భిణికి తప్పని అవస్థలు

- పల్లకిలో రెండు కిలో మీటర్లు తరలింపు
- రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు


పల్లకిలో గర్భిణిని ఆస్పత్రికి తీసుకు వెళుతున్న దృశ్యం

వుంచంగిపుట్టు, సెప్టెంబరు 5: మండలంలోని ఏనుగురాయి పంచాయతీ కిమలమామిడి గ్రామానికి పక్కా రహదారి సౌకర్యం లేకపోవడంతో రాకపోకలకు గ్రామ స్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ గ్రామానికి చెందిన గర్భిణికి గురువారం పురిటి నొప్పులు రావడంతో సుమారు రెండు కిలోమీటర్లు పల్లకి సాయంతో ప్రధాన రహదారికి తీసుకువచ్చారు. అక్కడి నుంచి ఆటోలో ఆమెను స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షుడు పి.రామదాసు మాట్లాడుతూ తమ గ్రామానికి పక్కా రహదారి సౌకర్యం కల్పించాలని పలుమార్లు అధికారులకు వినతులు అందించినా స్పందన కానరాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఏ చిన్నపాటి వ్యాధి సోకినా డోలీ మోతలు తప్పడం లేదని వాపోయారు. పాలకులు, అధికారులు స్పందించి పక్కా రహదారి నిర్మాణం జరిగేలా చూడాలని ఆయన కోరారు.

వినూత్నంగా 'వానపల్లి' వినాయకుడు

- 1116 మట్టి విగ్రహాలు, చిరుధాన్యాలు, ఎండు ఫలాలతో ఏకదంతుడు


వాసు రూపొందించిన వినూత్న వినాయకుడు

నర్సీపట్నం, సెప్టెంబరు 5: పట్టణానికి చెందిన స్వర్ణకారుడు ఎండు ఫలాలు, చిరు ధాన్యాలు, చిన్న చిన్న మట్టి ప్రతిమలు ఉపయోగించి మట్టి వినాయకుడిని అద్భుతంగా రూపొందించాడు. స్థానిక డాన్‌బాస్కో స్కూలు రోడ్డులో నివాసం ఉంటున్న స్వర్ణకారుడు వానపల్లి వాసు ప్రతి ఏటా వినాయకచవితికి వినూత్న రీతిలో వినాయకుడి విగ్రహాలు తయారు చేస్తుంటారు. ఈ ఏడాది శాంతినగర్ మండపంలో ఏర్పాటు చేయడానికి ఉత్సవ కమిటీ అభ్యర్థన మేరకు 15 రోజులు కష్టపడి ఆకర్షణీయంగా ఏక దంతుడు విగ్రహాన్ని రూపొందించారు. ఇందుకోసం కోటవురట్లలో మూడున్నర అడుగులు మట్టి విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారు చేయించారు. దీనికి తోడు వానపల్లి వాసు 1116 చిన్న చిన్న మట్టి విగ్రహాలు అచ్చు పోశారు చిన్న మట్టి విగ్రహాలు, ధాన్యం, సబ్జా గింజలు, ఆవాలు, గసగసాలు, బాదం, ఎర్ర కంది పప్పును మూడున్నర అడుగుల మట్టి విగ్రహానికి అద్ది గణనాథునికి సరికొత్త రూపంలో ఆవిష్కరించాడు.

గరిష్ఠ స్థాయికి పెద్దేరు జలాశయం

మాడుగుల రూరల్, సెప్టెంబరు 5 : మండలంలోని రావిపాలెం పెద్దేరు జలాశయం నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరువగా ఉంది. ఇక్కడ గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు. కనిష్ఠం 125.85 మీటర్లు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో జలాశయంలో నీటినిల్వలు పుష్కలంగా ఉన్నాయి. గురువారం సాయంత్రానికి 225 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో జలాశయం నీటిమట్టం 136.20 మీటర్లకు చేరింది. వర్షంనీరు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరడంతో గరిష్ఠ స్థాయికి చేరువవుతోంది. కుడి, ఎడమ కాలువకు 100 క్యూసెక్కుల నీరు విడిచిపెడుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి తొమ్మిది గంటలు దాటిన తర్వాత 350 క్యూసెక్కుల నీటిని గేటు తెరిచి విడిచిపెట్టినట్టు ఏఈ సుధాకర్ రెడ్డి తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	91.00
లైవ్ ధర	111.00
విత్ స్కిన్	192.00
స్కిన్ లెస్	202.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

విద్యార్థులకు ఉపాధ్యాయులే రోల్ మోడల్

- మంచి సమాజాన్ని నిర్మించడంలో టీచర్ల పాత్ర కీలకం
- గురుపూజోత్సవంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్
- 38 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే కొణతాలతో కలిసి ఘన సత్కారం


సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 5: మంచి సమాజాన్ని నిర్మించడంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా జిల్లా స్థాయి గురుపూజోత్సవాన్ని పట్టణంలోని గాంధీనగరం ఎస్ఆర్ శంకరన్ సమావేశమందిరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆమెతో పాటు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సర్వేపల్లి చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో పిల్లలు ఉపాధ్యాయులనే రోల్ మోడల్‌గా చూస్తారన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి విద్యను అందించడంతో పాటు సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. పిల్లలకు అర్థమయ్యేలా, మనసుకు హత్తుకునేలా విద్యాబోధన ఉండాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు చెప్పిన విషయాలకంటే, ఉపాధ్యాయులు ఏం చెబితే అది నిజమని విద్యార్థులు నమ్ముతారన్నారు. అందువల్లే విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయులపై ఆధారపడి ఉంటుందని ఆమె వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ గురుపూజోత్సవాన్ని స్వచ్ఛమైన తెలుగు సంస్కృతంలో నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. జిల్లా అధికారులలో సగంపైగా మహిళలే ఉన్నారని, వారికి ఓర్పు, సహనం ఎక్కువగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో పొందిన అనుభూతి, సంతృప్తి మరే ఇతర వృత్తులలో ఉండదని వివరించారు. నిత్య విద్యార్థి అంటే ఉపాధ్యాయులేనన్నారు. విద్యా ప్రమాణాలలో మార్పు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మట్టి నుంచి మాణిక్యాలను తయారు చేయగలిగే శక్తి ఉపాధ్యాయ వృత్తికే సాధ్యమని స్పష్టం చేశారు. జిల్లా విద్యాశాఖాధికారిణి వెంకటలక్ష్మమ్మ, డిప్యూటీ డీఈవో పి.అప్పారావు తదితరులు ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం విద్యాబోధనలో ఉత్తములుగా నిలిచిన ముగ్గురు ప్రధానోపాధ్యాయులు, 17 మంది స్కూల్ అసిస్టెంట్లు, 18 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లను సర్టిఫికెట్లు, మెమెంటోలతో కలెక్టర్, ఎమ్మెల్యే, డీఈవో సత్కరించారు. కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణలను విద్యాశాఖాధికారులు ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులతో పాటు జిల్లాలో గల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సత్కారం పొందిన ఉపాధ్యాయులతో కలెక్టర్, ఎమ్మెల్యే, డీఈవో

ప్రశాంత వాతావరణంలో సదరం శిబిరం

- పరిశీలించిన ఎమ్మెల్యే కొణతాల
- వైద్య సిబ్బందికి సూచనలు


దివ్యాంగుల వివరాలు నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 5: సదరం క్యాంపును గురువారం ఇక్కడ ప్రశాంతంగా నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ క్యాంపు గందరగోళంగా మారడంతో మండలాల వారీగా ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించడం ప్రారంభించారు. ఈ శిబిరానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ హాజరై పరిశీలించారు. దివ్యాంగులను నేరుగా కలిసి వారితో మాట్లాడారు. ఎటువంటి సమస్యలు రాకుండా పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారులకు సూచించారు. 200 మందికి పైగా హాజరైన దివ్యాంగుల్లో 65 మందికి పరీక్షలు జరిపి గుర్తించడం జరిగిందని సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ శిబిరానికి మానసిక వైకల్యం పొందినవారు, చెముడు, మూగవారు అధికంగా వస్తున్నారని వారికి ఈ శిబిరంలో అవకాశం లేదని డాక్టర్ శ్రీనివాస్ స్పష్టం చేశారు. అందువల్ల శిబిరానికి వచ్చి ఇబ్బంది పడొద్దని వారికి సూచించారు. ఈ శిబిరానికి హాజరైన దివ్యాంగులకు 82వ వార్డు జనసేన ఇన్‌చార్జి ఆళ్ల రామచంద్రరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బందితో పాటు జనసేన నాయకులు మళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

సంక్షేమ హాస్టళ్లకు దోమతెరలు : కలెక్టర్

అనకాపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు దోమ తెరలను అందిస్తున్నామని కలెక్టర్ విజయకృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ పరిశ్రమల యాజమాన్యాల సామాజిక బాధ్యత నిధులతో వీటిని సమకూర్చుతున్నట్టు వివరించారు. జిల్లాలో వివిధ కంపెనీల యాజమాన్యాల ద్వారా 30 వేల దోమ తెరలను సేకరించి, వీటిలో 20 వేల దోమ తెరలను ఏఎస్ఆర్ జిల్లాలో గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు పంపామని వెల్లడించారు. ఈ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల హాస్టళ్లకు 10 వేలు దోమ తెరలను కేటాయించామని ఆమె పేర్కొన్నారు.

నాలుగు మండలాల్లో కుండపోత

- భారీ వర్షంతో ఎటుచూసినా నీరే
- అవస్థలకు గురైన జనం
- లోతట్టు ప్రాంతాల్లో మరీ దారుణం
- అనకాపల్లిలో 40 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు


పాయకరావుపేటలో కుండపోత


వర్షపునీటితో చెరువును తలపిస్తున్న కశింకోట పీహెచ్‌సీకి వెళ్లే ప్రధాన రహదారి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 5: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా పలు మండలాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. అనకాపల్లి పట్టణంలో మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో భారీ ఉరుములతో కుండపోతగా పడింది. దీంతో జన జీవనం స్తంభించింది. పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముఖ్యంగా పీటీడీ కాంప్లెక్స్ ఆవరణ చెరువును తలపించింది. విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి కింద వర్షపునీరు చేరుకోవడంతో ఈ మార్గంలో వాహనచోదకులు రాకపోకలకు పడ్డారు. సబ్‌వేల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కశింకోట: మండలంలో గురువారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో ఎటుచూసినా జలమే కనిపించింది. ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాని వెళ్లే ప్రధాన రహదారులు చెరువును తలపించాయి. డ్రైనేజీలు లేక వర్షపు నీరు రోడ్డుపైనే నిలిచిపోవడంతో జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 22.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైందని మండల వ్యవసాయాధికారిణి స్వప్న తెలిపారు.


నక్కపల్లి మండలం గొడిచెర్ల హైవేపై...

పాయకరావుపేట/పాయకరావుపేట రూరల్: మండలంలో భారీ వర్షం కురిసింది. గురువారం ఉదయం నుంచి భానుడు ప్రతాపం చూపినప్పటికీ మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు ఏర్పడి కుండపోతగా పడింది. దీంతో మెయిన్ రోడ్డులోని గౌతమ్, చిత్రమందిర్, లక్ష్మి థియేటర్ సెంటర్లు చెరువును తలపించాయి. సత్యవరం, పెదరాంభద్రపురం, శ్రీరాంపురం, గోపాలపట్నం, రాజగోపాలపురం, కుమారపురం, మాసాహెబ్‌పేట, మంగవరం, ఆరట్లకోట, కేశవరం, తదితర గ్రామాల్లో ఎటు చూసినా నీరే కనిపించింది.

నక్కపల్లి: వాతావరణంలో మార్పుల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఒడ్డిమెట్ట, దేవవరం, గొడిచెర్ల, డొంకాడ, ఉద్దండపురం, చినదొడ్డిగల్లు, వేంపాడు, నెల్లిపూడి, డీఎల్‌పురం తదితర గ్రామాల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. వరి పొలాల్లో భారీగా నీరు చేరింది.

సింహాద్రి రెండో యూనిట్‌లో ఉత్పత్తికి అంతరాయం

పరవాడ, సెప్టెంబరు 5: సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్‌లో ఉత్పత్తికి గురువారం ఉదయం అంతరాయం ఏర్పడింది. ఇదే యూనిట్‌కు సంబంధించి బాయిలర్ ట్యూబ్‌ల్లో రంధ్రాలు ఏర్పడడంతో ఉత్పత్తి అర్ధంతరంగా నిలిచిపోయింది. అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు ప్రారంభించారు. రెండు రోజుల్లోగా యూనిట్‌లో ఉత్పత్తిని పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇదిలావుంటే మిగతా ఒకటి, మూడు, నాలుగు యూనిట్లలో ఉత్పత్తి పూర్తిస్థాయిలో జరుగుతుందని అధికారులు తెలిపారు.

11న ఏపీ అభ్యుదయ రచయితల సంఘం మహాసభ

కొత్తూరు, సెప్టెంబరు 5: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ప్రథమ మహాసభ ఈ నెల 11న జరగనుందని ఆ సంఘం ప్రతినిధి జీఎల్ఎన్ శాస్త్రి ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి ప్రభుత్వ శాఖా గ్రంథాలయంలో సాయంత్రం ఆరు గంటలకు జరగనున్న ఈ సభకు అరసరం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని వివరించారు. సాహితీవేత్తలు, అనకాపల్లి ప్రముఖులు సభను విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు.

సీనియర్ న్యాయవాదులకు సన్మానం


సీనియర్ న్యాయవాదిని సన్మానిస్తున్న న్యాయమూర్తులు

నర్సీపట్నం రూరల్, సెప్టెంబరు 5: గురు పూజోత్సవం సందర్భంగా కోర్టు సముదాయంలో సీనియర్ న్యాయవాదులను సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్‌ఖాన్. జూనియర్ సివిల్ జడ్జి రోహిత్ గురువారం ఘనంగా సన్మానించారు. 1956లో కోర్టు ఏర్పాటు చేసిన నాటి నుంచి న్యాయవాద వృత్తిని కొనసాగించి స్వర్గస్తులైన 26 మంది చిత్రపటాలను అసోసియేషన్ సమావేశ మందిరంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్టా ప్రభాకర్, కార్యదర్శి అనిమిరెడ్డి శివకృష్ణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి రామశేషు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

విజయవాడ వరద బాధితులకు బాసట

- జిల్లాలోని పరిశ్రమల యాజమాన్యాలు రూ.43.25 లక్షలు అందజేత
- కలెక్టర్ విజయకృష్ణన్ వెల్లడి

అనకాపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విజయవాడలో కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు జిల్లాలో పరిశ్రమల యాజమాన్యాల తరపున ఇప్పటి వరకు రూ.43.25 లక్షలు సాయంగా అందజేసినట్టు కలెక్టర్ విజయకృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎసెన్షియా అడ్వాన్స్‌డు సైన్సెస్ ప్రైవేటు లిమిటెడ్ రూ.5లక్షలు, రాంకీ ఫార్మాసిటీ ఇండియా లిమిటెడ్ కంపెనీ రూ.10లక్షలు, అశుర్ధన్ ఫార్మా రూ.లక్ష, నోఓఫోర్ అడ్వాన్స్‌డు రూ.75వేలు, డెల్టా మెరైన్ ఇంజినీర్స్ రూ.20 వేలు, సాగర్ సిమెంట్స్ రూ.లక్ష, దక్కన్ కెమికల్స్ రూ.10 లక్షలు, హెటిరో ఫౌండేషన్ రూ.10 లక్షలు, డల్వకాట్ బయో రూ.20 వేలు, అచ్యుతా లేబొరేటరీస్ రూ.10వేలు, విజయశ్రీ ఆర్గానిక్స్ రూ.5 లక్షలు విరాళాలు అందజేసినట్టు ఆమె వివరించారు. పరిశ్రమల యాజమాన్యాల ద్వారా అందిన విరాళాలను ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపుతున్నట్టు పేర్కొన్నారు.

కూలిన కూండ్రం పాఠశాల ప్రహరీ గోడ


కూండ్రంలో కూలిపోయిన ఎంపీయూపీ పాఠశాల ప్రహరీ గోడ

కొత్తూరు, సెప్టెంబరు 5: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా అనకాపల్లి మండలంలోని కూండ్రం ఎంపీయూపీ పాఠశాల ప్రహరీ గోడ కూలిపోయింది. గ్రామంలో మెయిన్ రోడ్డును ఆనుకొని ఉన్న యాదగిరి చెరువుకు వెళ్లే ప్రధాన కాలువ కప్పివేయడంతో వర్షపు నీరు ప్రాథమిక పాఠశాల గోడ వద్ద తిష్ఠ వేసింది. దీనికితోడు వర్షం వచ్చినప్పుడల్లా ఈ నీటి ఉధృతి మరింత పెరగడంతో చెత్తాచెదారం ఇక్కడకు కొట్టుకువస్తోంది. దీంతో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి గోడ ఒక్కసారిగి కూలిపోయింది. అయితే రాత్రి ఈ ఘటన జరగడంతో పెద్ద ప్రమాదం తప్పిందని అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ప్రహరీ గోడను పునర్నిర్మించడంతో పాటు ఇటువంటి సంఘటన పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాల్సిందిగా అంతా కోరుతున్నారు.

రావణాపల్లి ఆయకట్టుకు నీరు విడుదల

గొలుగొండ సెప్టెంబరు 5: రావణాపల్లి రిజర్వాయర్ గేట్లు ఎత్తి నర్సీపట్నం మునిసిపాలిటీ కౌన్సిలర్ చింతకాయల రాజేష్ గురువారం సాగునీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ నర్సీపట్నం, గొలుగొండ మండలాలకు చెందిన సుమారు మూడు వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఈ ఏడాది వర్షాలు అనుకూలంగా ఉండడంతో ఖరీఫ్, రబీ పంటల సాగుకు సాగునీరు పుష్కలంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం 215 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్టు చెప్పారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో రిజర్వాయర్‌లో పూడిక తొలగించి నీటి నిల్వలు ఉండేవిధంగా ఇప్పటి ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు కృషి చేశారన్నారు. వచ్చే ఏడాది రిజర్వాయర్ పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, సీనియర్ నాయకులు చిటికెల సాంబమూర్తి, కొల్లి సత్తిబాబు, కర్రి నాయుడు, ధనిమిరెడ్డి మధు, పెట్ల బాబులు, ఇరిగేష్ ఏఈ సూర్య తదితరులు పాల్గొన్నారు.

'సింహాద్రి' గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో ఎన్ఎస్‌డబ్ల్యూయూ ఘన విజయం


ఎన్ఎస్‌డబ్ల్యూయూ అధ్యక్ష, కార్యదర్శుల విజయోత్సవం

పరవాడ, సెప్టెంబరు 5 : సింహాద్రి ఎన్టీపీసీ ప్లాంట్‌లో గురువారం నిర్వహించిన గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో ఎన్టీపీసీ సింహాద్రి వర్కర్స్ యూనియన్ (ఎన్ఎస్‌డబ్ల్యూయూ) ఘన విజయం సాధించింది. మొత్తం 197 ఓట్లు పోలవ్వగా ఎన్ఎస్‌డబ్ల్యూయూకి 117 ఓట్లు, ప్రత్యర్థి ఎన్టీపీసీ సింహాద్రి మజ్దూర్ యూనియన్ (ఎన్ఎస్ఎంయూ)కి 80 ఓట్లు వచ్చాయి. 37 ఓట్ల మెజార్టీతో ఎన్ఎస్‌డబ్ల్యూయూ గెలుపొందినట్లు ఎన్నికల అధికారి బీబీ పాత్ర ప్రకటించారు. దీంతో ఈ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులుగా బండారు శ్రీధర్‌నాయుడు, జి.శంకర్‌వర్మ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా విజేతలను టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాసవరపు అప్పలనాయుడు తదితరులు అభినందించారు.



టీచర్ ప్రభుదాస్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, ఎమ్మెల్యే మత్స్యలింగం



టీచర్ విజయలక్ష్మిని సన్మానిస్తున్న ఎంఈవోలు విశ్వప్రసాద్, సరస్వతి, తదితరులు



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఉమానీలకంఠేశ్వర ఆలయ కమిటీ ప్రతినిధులు

ఉత్తమ గురువులకు సత్కారం

పాడేరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా స్థాయి వేడుకల్లో భాగంగా స్థానిక కాఫీహౌస్‌లో కలెక్టర్ దినేశ్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్దార్, జేసీ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ సౌర్యమన్ పటేల్, జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, అరకులోయ ఎమ్మెల్యే మత్స్యలింగం 104 మంది ఉత్తమ గురువులను సత్కరించారు. అలాగే మండల స్థాయిలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 8 మంది టీచర్లను ఘనంగా సత్కరించారు. స్థానిక ఉమానీలకంఠేశ్వర ఆలయంతో ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు ఆధ్వర్యంలో టీచర్లు వరహాలరాజు. డి.బాబూరావు, ఎం.గురునాథ్, పి.సింహాచలం, వి.రామకృష్ణ, ఎస్.సోమరాజు, పి.బాలన్న, ఎస్.శివయ్యలకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి, జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజిరావు, టీడబ్ల్యూ డీడీ ఐ.కొండలరావు, ఎంపీడీవో సాయినవీన్, ఎంఈవోలు విశ్వప్రసాద్, సరస్వతిదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతపల్లిలో..

ఉత్తమ సేవలందించే ఉపాధ్యాయులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని స్థానిక ఎంఈవో పనసల ప్రసాద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో విద్యాశాఖ అధికారులు గురుపూజోత్సవాన్ని నిర్వహించి, ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా పనిచేయాలన్నారు. సమయపాలన, ఉత్తమ విద్యాబోధన చేపట్టే ఉపాధ్యాయులను విద్యార్థులు, తల్లిదండ్రులు ఎన్నడూ మర్చిపోలేరన్నారు. అలాగే స్థానిక గిరిజన సంక్షేమ శాఖ బాలిక ఆశ్రమ పాఠశాలలో ఏపీటీఎఫ్, తాజంగి ప్రభుత్వ పాఠశాలలో గిరిజన ఉద్యోగుల సంఘం, జనసేన నాయకులు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 గెమ్మెలి బోడం నాయుడు, పీజీహెచ్ఎం జేపీ కొండలరావు, ఏపీటీఎఫ్ నాయకుడు దేపూరి శశికుమార్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యూవీగిరి, గిరిజన సంఘం నాయకుడు గెమ్మెలి మోహన్ జనసేన నాయకుడు ఉగ్రంగి లక్ష్మణరావు పాల్గొన్నారు.

సీలేరులో..

జీకేవీధి మండలం సీలేరులో గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, జెన్‌కో డీఏవీ పాఠశాల, జూనియర్ కాలేజీ, బాలుర గురుకుల పాఠశాల, ఎంపీపీ పాఠశాల, బాలికల ఆశ్రమ పాఠశాల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. డీఏవీ పాఠశాల హెచ్ఎం కిరణ్‌కుమార్‌ను సహా ఉపాధ్యాయులు సత్కరించారు.



చింతపల్లి: ఉత్తమ ఉపాధ్యాయులతో ఎంఈవో-1,2 ప్రసాద్, బోడం నాయుడు

డుంబ్రిగుడలో..

గురుపూజోత్సవం సందర్భంగా స్థానిక జూనియర్ కళాశాల, గుంటసీమ, కేజీబీవీ పాఠశాలల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ స్వామినాయుడు మాట్లాడుతూ.. అజ్ఞానాన్ని పారదోలే ఏకైక వ్యక్తి గురువు అని అన్నారు. జోడిగుడ పాఠశాలలో ఉపాధ్యాయుడు మోహనరావును గ్రామస్థులు, ఎంఈవో సుందరరావు సన్మానించారు. అలాగే జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన హెచ్ఎం అర్జున్, స్కూల్ అసిస్టెంట్లు భీమరాజు, శైలజ, సుబ్బారావులను పాడేరులో కలెక్టర్ దినేశ్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్, జిల్లా అధికారులు సత్కరించారు.

గూడెంకొత్తవీధిలో..

మండలంలోని పెదవలస ఉన్నత పాఠశాల, జర్రెల ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో గురువారం గురుపూజోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయులను ఎంఈవో తగ్గి సత్యనారాయణను సన్మానించారు. అలాగే ఎంఈవోని ఉపాధ్యాయులు సత్కరించారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం కుమ్మరి సింహాచలం, డిప్యూటీ వార్డెన్ శేఖర్, సీనియర్ ఉపాధ్యాయుడు గసాడి పద్మనాభం పాల్గొన్నారు.

అనంతగిరిలో..

మండలంలోని చిలకలగెడ్డ ఆశ్రమ పాఠశాల ఆవరణంలోని ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి నీలవేణి, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి, ఎంఈవో కిల్లో బాలజీ, ఏటీడబ్ల్యూవో కూడ వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యురాలు మితుల, ఉపాధ్యాయ సంఘ నాయకులు సన్యాసిరావు, గురుదొర, దేముడు, శ్రీనివాసరావు, పి.దేముడు, రాంబాబు పాల్గొన్నారు.

హుకుంపేటలో

మండలంలోని అన్ని పాఠశాలల్లో గురువారం గురుపూజోత్సవాన్ని జరుపుకున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికైన మొసియ్య సత్యారావు(మాసాడ)ను ఎంపీ తనూజ రాణి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎంఈఓ ఈశ్వరరావు పాల్గొన్నారు.

కొయ్యూరులో..

స్థానిక గిరిజన భవన్‌లో గురువారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన ఎనిమిది మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపీపీ రమేశ్‌బాబు, జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్, ఎంఈవో రాంబాబు, సీఐ వెంకటరమణ సన్మానించారు. అనంతరం సన్మాన గ్రహీతలు గడుతూరి వెంకటేశ్వరావు (నిమ్మలపాలెం), జల్లి లక్ష్మి (అంతాడ), పోతురాజు మురళీ కృష్ణ (నూకరాయితోట), లోతా శ్రీరామలక్ష్మి (కంతారం), వసుపరి లీలావతి (పి.మాకవరం),శ్యామల శకుంతల (ఎన్. కంఠారం), దూసరి నాగమణి (చింతలపూడి), గొల్లపల్లి రాజశేఖర్ (ముకుడుపల్లి) తమ సేవలను గుర్తించి, సన్మానించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, ఎంపీటీసీ సభ్యుడు బిడ జాన అప్పారావు, రాజేంద్రపాలెం సర్పంచ్ పీటా సింహాచలం, ఎస్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అరకులోయలో..

అరకులోయలో ఘనంగా గురుపూజోత్సవం జరిగింది. సీఏహెచ్ బాలుర ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఎంఈవోలు త్రినాథరావు, భారతీరత్నం, సీఏహెచ్‌స్కూల్ హెచ్ఎం దయానిధి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్‌కుమార్‌నాయక్, మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.రామకృష్ణ, వైస్‌ప్రిన్సిపాల్ పి.చలపతి, అధ్యాపకులు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో 150 మొక్కలను నాటారు. అనంతరం ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులను సత్కరించారు. అలాగే మండల విద్యాశాఖ అధికారులు వంతల త్రినాథరావు, భారతీరత్నంలను ఎస్‌టీఐ అధికారులు ఘనంగా సత్కరించారు.

ముంచంగిపుట్టులో..

మండలంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానిక శారద నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శారద నికేతన్ ప్రిన్సిపాల్ మత్స్యరాజు, ఉపాధ్యాయులు దొన్ను, తదితరులు పాల్గొన్నారు.



కొయ్యూరు: నిమ్మలపాలెంలో టీచర్‌ను సత్కరిస్తున్న దృశ్యం



డుంబ్రిగుడ: సుబ్బారావును సత్కరిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్



హుకుంపేట: సత్యారావును సత్కరిస్తున్న ఎంపీ తనూజరాణి



అరకులోయ: డిగ్రీ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

పౌష్టికాహారాన్ని గర్భిణులు తీసుకోవాలి

▸▸ ఐపీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

హుకుంపేట, సెప్టెంబరు 5: గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా వినియోగించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్. సూర్యలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక సీడీపీవో కార్యాలయం వద్ద పౌష్టికా హార మాసోత్సవాల్లో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల గర్భిణులు, బాలింతలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ వేడి పదార్థాలు మాత్రమే తీసుకోవాలన్నారు. రాజ్‌మా, క్యారెట్, బీన్స్, తోట కూర వంటివి అధికంగా తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రతి నెలా బరువు తీసుకోవాలని, ఆరోగ్య పరీక్షలపై పర్యవేక్షణ ఉండాలన్నారు. శిశువు, బాలింతలు, గర్భిణులు ఎటువంటి ఆరోగ్య సమస్యలతో మరణించినా సిబ్బందిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని, తప్పుడు నివేదికలు అందించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో బాలమణి, ఎంపీడీవో వెంకటరావు, ఎంపీటీసీ సభ్యురాలు కొమ్మ రమ, సర్పంచ్ పూర్ణిమ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

'పొలాల్లో నీటిని తొలగించుకోవాలి'

చింతపల్లి, సెప్టెంబరు 5: పంటల సంరక్షణకు పొలాల్లో నీటిని రైతులు తొలగించుకోవాలని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బయ్యపురెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చౌడుపల్లి, గెంజిగెడ్డ, బయలుకించంగి గ్రామాల్లో శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల పొలాల్లోకి చేరిన నీటితో పంటలు కుళ్లిపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ నీటిని బయటకు పంపించాల న్నారు. రైతులు వరి నాట్లు వేసిన 20 రోజుల నుంచి నెల రోజుల మధ్య ఎకరాకు 20 కిలోల యూరియా, 15కిలోలు పోటాష్ వేసుకోవాలన్నారు. ఎండు తెగులు లక్షణాలు అధికంగా కనిపిస్తే లీటరు నీటికి మూడు గ్రాముల బ్లైటాక్స్ పది లీటర్ల నీటిలో కలుపుకోవాలన్నారు. ఈ ద్రావణంలో ఒక గ్రాము స్ట్రెప్టోమైసిన్ కలిసి పంటపై పిచికారీ చేసుకోవాలన్నారు. వేరుశనగ పంటలో తిక్క ఆకుమచ్చ తెగులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ఒక లీటరు నీటిలో ఒక గ్రాము కార్బెండిజంగాని, 2.5గ్రాముల మ్యాంకోజబ్ మిశ్రమాన్ని పంటపైన పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ బాల హస్సేన్ రెడ్డి పాల్గొన్నారు.



రైతులకు సూచనలు ఇస్తున్న బయ్యపురెడ్డి

పార్టీని వీడొద్దు : ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 5: వైసీపీ నాయ కులు, కార్యకర్తలు పార్టీ మారవద్దని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాజ విశ్వేశ్వరరాజు కోరారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంతమంది ఎంపీటీసీ సభ్యులు, నాయకులు కూటమిలో చేరడం జరిగిందన్నారు. తాను కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో ఉంటానని, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, వైసీపీ నాయకుడు జల్లి సుధాకర్, సర్పంచులు ఫోరం అధ్యక్షుడు కుందరి రామకృష్ణ, మండలాధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ పాల్గొన్నారు.

గిరిజనుల చెంతకు అత్యాధునిక వైద్యం

... 5వ పేజీ తరువాయి

గిరిజన ప్రాంతంలో వ్యాధులు విజృంభించి గిరిజనులు ప్రాణాలు కోల్పోవడం సర్వసాధారణమై పోయింది. దీంతో గిరిజనులకు అత్యవసర, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పాడేరు, అరకులోయ, చింతపల్లి ఆస్పత్రుల నుంచి కేజీహెచ్‌కి తరలించాల్సిన పరిస్థితి చాలా కాలంగా కొనసాగుతున్నది. ఈ మూడు ప్రాంతాల నుంచి కేజీహెచ్‌కి రోగిని తరలించేందుకు కనీసం మూడు గంటల సమయం పడుతున్నది. అలాగే గిరిజనులు కేజీహెచ్‌లో పరిస్థితులకు అలవాటు పడలేక రోగం నయం కాకుండా మధ్యలోనే ఇళ్లకు వచ్చేస్తున్న సందర్భాలు కొన్ని కాగా, ఎంత సమస్య వచ్చినా కేజీహెచ్‌కు వెళ్లకుండా మొండికేస్తున్న సందర్భాలు అనేకం. దీంతో కేజీహెచ్‌లో గిరిజనుల కోసం ప్రత్యేకంగా ట్రైబల్ సెల్‌ను ఏర్పాటు చేసినప్పటికీ సంపూర్ణంగా మెరుగైన వైద్య సేవలు అందని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ఏజెన్సీకి కేంద్ర బిందువైన పాడేరులో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయాలనే డిమాండ్ చాలా ఏళ్లుగా ఉంది. ఎట్టకేలకు మెడికల్ కాలేజీ మంజూరు కావడం, నిర్మాణ పనులు జరుగుతుండడంతో పాటు ఈ ఏడాది నుంచే ఎంబీబీఎస్ తరగతులు మొదలు కానుండడంతో వైద్యపరంగా ఈ ప్రాంతానికి ఎంతో మేలు జరుగుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది. ఎంబీబీఎస్ విద్యార్థులకు బోధన సాగించే వివిధ వైద్య విభాగాలకు చెందిన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సర్జన్లు పదుల సంఖ్యలో ఉంటారు. వారంతా మెడికల్ కాలేజీలో విద్యార్థులకు థియరీకి సంబంధించిన అంశాలను తరగది గదుల్లో, ప్రాక్టికల్స్‌కు సంబంధించిన అంశాలను మరో ఏడాది వరకు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో బోధిస్తారు. దీంతో ఇక్కడే అన్ని రకాల రోగాలకు వైద్య సేవలు అందించే ప్రత్యేక వైద్య నిపుణులుండడంతోపాటు ఎటువంటి శస్త్ర చికిత్సలైనా ఇక్కడే నిర్వహించేందుకు అవసరమైన సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. ఏడాది తరువాత మెడికల్ కాలేజీ భవనాల నిర్మాణ పనులు పూర్తయితే అక్కడే 500 పడకలు అందుబాటులో ఉంటాయి. ఫలితంగా ఎటువంటి సమస్యాత్మక కేసునైనా స్థానికంగానే పరిష్కరించే అవకాశం కలుగుతుందని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు అంటున్నారు. అలాగే ఇన్నాళ్లూ వంద పడకల ఏరియా ఆస్పత్రిగా ఉన్న స్థానిక వైద్యశాలను రెండు వందల పడకల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిగా మార్పుచేశారు. దీంతో మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఆస్పత్రి ఉండడంతో గిరిజన రోగులకు స్పెషలిస్టు వైద్య సేవలు చేరువవుతున్నాయి. రానున్న రోజుల్లో ఎటువంటి రోగులైనా అత్యవసర, మెరుగైన వైద్యం కోసం పాడేరు దాటి వెళ్లాల్సిన అవసరం ఉండదు.

వాగులు ఉగ్రరూపం

... 5వ పేజీ తరువాయి

ఉందని గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు.

మోతుగూడెంలో..

మోతుగూడెం: జిల్లాలోని చింతూరు మండలం మోతుగూడెంలో బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. గురువారం తెల్లవారుజాము నుంచే మోతుగూడెం- చింతూరు మార్గమధ్యంలో రోడ్డు పైనుంచి వరద నీరు ప్రవహించడంతో వాహనాలు, అంబులెన్స్ రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్టీసీ ప్రయాణికులు చాలా ఇబ్బంది పడ్డారు. తులసిపాక- మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో చెట్లు నేలకొరిగాయి.



మోతుగూడెం: రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

సీఎం సహాయ నిధికి ఎస్‌హెచ్‌జీలు రూ.5 లక్షలు విరాళం

పాడేరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.5 లక్షల విరాళం ప్రకటించారు. ఈ మేరకు ఇందుకు సంబంధించిన చెక్కును కలెక్టర్ ఏఎస్.దినేశ్ కుమార్‌కు గురువారం సాయంత్రం అందించారు. వరద బాధితులకు తమవంతు సాయంగా రూ.5 లక్షలు అందించామని మహిళా సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, వెలుగు డీపీఎం వీవీ.ప్రసాద్, జిల్లా సమాఖ్య అధ్యక్ష,కార్యదర్శులు దేవీ, భవాని, సభ్యులు జయ, లక్ష్మి, చిన్నమ్మ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు చెక్‌ను అందిస్తున్న ఎస్‌హెచ్‌జీ ప్రతినిధులు

రాజ్‌మా విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి : గిడ్డి ఈశ్వరి

పాడేరురూరల్, సెప్టెంబరు 5: రాష్ట్ర ప్రభుత్వం శత శాతం రాయితీపై అందిస్తున్న రాజ్‌మా విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి కోరారు. మండల వ్యవసాయ శాఖాధికారి సూర్యకుమారి ఆధ్వర్యంలో చింతలవీధి, గబ్బంగి, డోకులూరు, లింగాపుట్టు పంచాయతీల పరిధిలోని రైతులకు రాజ్‌మా విత్తనాలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..వాణిజ్య పంటలకు ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ, పంచాయతీ సర్పంచులు వంతాల సీతమ్మ, కె.సన్నిబాబు, బి.చిట్టిబాబు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు బి.అప్పలరాజు, ఉపసర్పంచ్ టి.సురేష్, అగ్రికల్చర్ అసిస్టెంట్ జ్యోతి, మాణిక్యం రైతులు పాల్గొన్నారు.



రైతులకు రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్న గిడ్డి ఈశ్వరి

సకాలంలో వైద్య సేవలు అందించాలి

▸▸ డీసీహెచ్ఎస్‌వో కృష్ణారావు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 5: ఆస్పత్రులకు వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా కో-ఆర్డినేటర్ (డీసీహెచ్ఎస్‌వో) కె.కృష్ణారావు అన్నారు. గురువారం ఆయన స్థానిక సీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించి, రికార్డులు, మందుల గదిని పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. సీహెచ్‌సీలో పైకప్పుకు మరమ్మతులు జరిగే విధంగా చూడాలన్నారు. అలాగే సీహెచ్‌సీలో రోగులకు అందించే ఉచిత భోజనాన్ని పరిశీలించారు. రోగుల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం వైద్యులు, వైద్య సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు గీతాంజలి, సంతోష్, ధరణి, హెడ్ నర్సు సింహాచలం పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్‌వో కృష్ణారావు

డెంగ్యూ కట్టడికి ప్రజలు సహకరించాలి

▸▸ డీఎంహెచ్‌వో జమీల్ బాషా

పాడేరురూరల్, సెప్టెంబరు 5: గ్రామాల్లో డెంగ్యూ వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజలు సహకరించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి షేక్ జమీల్ బాషా కోరారు. గురువారం మినుములూరు పీహెచ్‌సీ సిబ్బంది 8 గ్రూపులుగా ఏర్పడి పాడేరులో ఇంటింటికి వెళ్లి డెంగ్యూ వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు, దోమ లార్వా దశను పూర్తిగా నాశనం చేసేందుకు ప్రజలు చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇళ్లలో ఉండే నీటి నిల్వలు, ఇంటి ముంగిట ఉండే గుంటలు, వాహన టైర్లలో నిలిచిన నీటి నిల్వలను సిబ్బంది పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో జమీల్ బాషా మాట్లాడుతూ.. డెంగ్యూ వ్యాధి, దోమలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని కోరారు. ఇళ్లలో ఉండే ఫ్రిజ్‌లు, వాషింగ్ మిషన్ డ్రమ్ముల్లో, పూల కుండీల్లో నీరు నిల్వ లేకుండా వారంలో ఒక రోజును డ్రై డేగా పాటించాలని కోరారు.కార్యక్రమంలో మలేరియా యూనిట్ ఏఎంవో శేషయ్య, ఎస్‌యూవో ధనుంజయ్, హెల్త్ అసిస్టెంట్‌లు శెట్టి నాగరాజు, జేవీ.చలం, పడాల్, లక్ష్మణ్, శంకర్, వైవీ.రమణ, ఎలీషారావు, ఆశా వర్కర్లు, సీహెచ్‌డబ్ల్యూలు పాల్గొన్నారు.



డెంగ్యూపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో జమీల్ బాషా

సంక్షిప్తంగా..

రేషన్‌తో గోధుమ పిండి, చక్కెర పంపిణీ

చింతపల్లి, సెప్టెంబరు 5: ఈనెల రేషన్ బియ్యంతోపాటు గోధుమపిండి, చక్కెర పంపిణీ చేస్తున్నట్టు స్థానిక తహసీల్దార్ టి.రామకృష్ణ తెలిపారు. గురువారం చౌడుపల్లిలో రేషన్ పంపిణీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తూనికల్లో మోసం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరికి చక్కెర, గోధుమ పిండి అందకపోతే ఫిర్యాదు చేయాలన్నారు.

రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ

చింతపల్లి, సెప్టెంబరు 5: గురుపూజోత్సవం పురస్కరించుకుని ఏరియా ఆస్పత్రి రోగులకు అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోచలి రామకృష్ణ పండ్లు, రొట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నాయకులు సత్యానంద లక్ష్మి, సౌనాయి కార్యవర్తి పాల్గొన్నారు.

సస్యరక్షణకు జీవామృతం సంజీవని

కొయ్యూరు, సెప్టెంబరు 5: వరి పొలాలకు జీవామృతం సంజీవనిలా పనిచేసి, దిగుబడి పెంచుతుందని మండల వ్యవసాయాధికారిణి ఉమాదేవి అన్నారు. శుక్రవారం రేవళ్ల గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించి, జీవామృతం తయారీ, వినియోగం, తీసుకోవల్సిన సస్యరక్షణ చర్యలపై ఏవో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 200 లీటర్ల నీటిలో 10 లీటర్లు ఆవు మూత్రం, 10 కేజీల పేడ, రెండేసి కేజీల బెల్లం, శనగపిండి కొద్దిగా పుట్టమన్ను కలిపి ఉదయం, సాయంత్రం సవ్య, అపసవ్య దిశల్లో తిప్పుతూ జీవామృతాన్ని వారం నుంచి పది రోజులు వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటలక్ష్మి, వ్యవసాయాధికారులు రూప, సతీష్, ఎస్‌వోటి ఆర్గనైజర్ రవికుమార్ రైతులు పాల్గొన్నారు.

ధారాలమ్మ హుండీ ఆదాయం లెక్కింపు



అమ్మవారి హుండీ లెక్కిస్తున్న దృశ్యం

సీలేరు, సెప్టెంబరు 5: జీకేవీధి మండలం ధారకొండ ఘాట్ రోడ్డులో కొలువైన ధారాలమ్మ అమ్మవారి హుండీ ఆదాయం లెక్కింపు గురువారం నిర్వహించారు. దేవదాయ శాఖ ఈవో సాంబశివరావు ఆధ్వర్యంలో స్థానిక కూటమి సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కించినట్టు ఈవో తెలిపారు. హుండీ ఆదాయం మూడు నెలలకు రూ.5,55,657 ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి సభ్యులు పోతురాజు గోవింద్, పోతురాజు కృష్ణ, మాడుగుల చంద్రిక, ధారకొండ యూత్ పాల్గొన్నారు.

'మహిళల ఆర్థికాభివృద్ధికి శిక్షణ దోహదం'

పాడేరురూరల్, సెప్టెంబరు 5: మహిళల ఆర్థికాభివృద్ధికి స్వయం ఉపాధి శిక్షణ ఎంతగానో దోహదపడతుందని చైతన్య స్రవంతి సంస్థ డైరెక్టర్ ఎం.మాలిని అన్నారు. మండలంలోని మినుములూరు చైతన్య స్రవంతి సంస్థ క్యాంప్ కార్యాలయంలో రెండు రోజులుగా అందించిన స్కిల్ డవలప్‌మెంట్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. శిక్షణ పొందిన మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు గార్మెంట్ ఆఫ్ ఇండియా నుంచి మంచి అవకాశాలు ఉన్నాయని వివరించారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు ధ్రువ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో అరణ్యక సంస్థ డైరెక్టర్ కె.రాజ్‌కుమార్, స్థానిక యూత్ సంఘం వైస్ ప్రెసిడెంట్ కె.భారతి, ఎస్.కొండబాబు, మహిళా ప్రతినిధులు కె.సన్యాసమ్మ, పి.చిలకమ్మ పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 5: గిరిజనులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆర్‌వీనగర్ వైద్యాధికారి సౌమ్య అన్నారు. గురువారం దోనుగుమ్ములు, చిన్నగొంది, అడపరిగొంది గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల్లో 46 మందికి పరీక్షలు నిర్వహించగా.. 15 మంది జ్వరబాధితులకు రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాజా రవీంద్ర, ఎంపీహెచ్‌వో జాన్సన్ పాల్గొన్నారు.

'వెటర్నరీ అసిస్టెంట్‌లకు వేరే పనులు అప్పగించొద్దు'



నరసింహులకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అరకులోయ, సెప్టెంబరు 5: గ్రామ సచివాలయాల్లో పనిచేసే వెటర్నరీ అసిస్టెంట్‌లను ప్రభుత్వం ఇతర పనుల నుంచి తప్పించాలని పశుసంవర్థక శాఖ ఉద్యోగుల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సీనయ్య కోరారు. ఈ మేరకు గురువారం ఇక్కడకు వచ్చిన జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ నరసింహులకు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు, బ్రూసెల్ల వ్యాధి నిరోధక టీకాలు, గొర్రెలు, మేకలకు పారుడు వ్యాధి టీకాల కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. ఇదే సమయంలో వీరికి పశు బీమా, పశు శాల పథకం పనులు అప్పగించడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో అనంతగిరి పశు వైద్యాధికారి డాక్టర్ సందీప్, వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారి సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జెన్‌కో సివిల్ ఈఈగా భాస్కరరావు బాధ్యతల స్వీకారం

సీలేరు, సెప్టెంబరు 5: సీలేరు ఏపీ జెన్‌కో సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా గంటా భాస్కరరావు గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఈఈగా పనిచేసిన ప్రభాకరరావుకు పోలవరం ప్రాజెక్టుకు ఇటీవల బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విజయవాడ జెన్‌కో కేంద్ర కార్యాలయంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న గంటా భాస్కరరావుకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పదోన్నతి కల్పించి సీలేరు సివిల్ ఓఅండ్ఎం డివిజన్ వన్ ఈఈగా నియమించారు. ఈ మేరకు ఆయన గురువారం సీలేరులో ఈఈగా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఈఈగా కొనసాగిన ప్రభాకరరావు, పంప్డ్ స్టోరేజీ ఏడీఈ టి.అప్పలనాయుడు, క్యాంప్ ఏడీఈ వెంకటమధు, ఏఈఈలు సురేష్, అనుదీప్, ఇతర సిబ్బంది నూతన ఈఈ భాస్కరరావును ఘనంగా సత్కరించారు.